www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024



ఏపీ రీసెట్ నోటిఫికేషన్ విడుదల

దరఖాస్తుకు మార్చి 19 చివరి గడువు

ప్రజాశక్తి - క్యాంపస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పీహెచ్.డీ సీట్ల భర్తీకి ఏపీ రీసెట్ 2023 – 24 నోటిఫికేషన్ విడుదల అయ్యింది. ఈ నెల 20 వ తేదీ నుంచీ దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుకు మార్చి 19 వ తేదీ చివరి గడువుగా విధించారు. ఏప్రిల్ 4 నుంచీ 7 వ తేదీ వరకూ దరఖాస్తులో సవరణలు చేసుకునే వెసులుబాటు ఇచ్చారు. ఏప్రిల్ నెలలోనే ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచీ 11 గంటల వరకూ, మధ్యాహ్నం 2 నుంచీ 4 గంటల వరకూ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు పొందిన వారు ప్రవేశ పరీక్షకు అర్హులు. సమగ్ర సమాచారం కోసం – 9030407022 ఫోన్ లో కానీ, వెబ్ సైట్ నందు కానీ చూడవచ్చు.

'గిట్టుబాటు' కాని వ్యవ'సాయం'

పదేళ్ల కిందట ఎకరా పొలంలో వరి పండించేందుకయ్యే ఖర్చు రూ.10 వేలు. ఇప్పుడు రూ.35 వేలకు చేరుకుంది. అయితే 75 కిలోల ధాన్యం బస్తాకు మిల్లర్లు చెల్లిస్తున్న ధర మాత్రం రూ.1700 లోపే. ఒక్కో ఎకరాకు 30 బస్తాల దిగుబడి వేసుకున్నా వచ్చే ఆదాయంలో రైతులకు మిగిలేది అరకొరే. అదే 75 కిలోల బియ్యం బస్తా మార్కెట్లో కొనుగోలు చేస్తే మాత్రం రూ.4,500 పైనే ధర పలుకుతోంది.

కుప్పం నియోజకవర్గంలో పూలు, కూరగాయలు సాగవుతాయి. అయితే పొలంలో కూరగాయలు కిలో 10-15 ధర పలుకుతుంటే, తిరుపతి మార్కెట్లో మాత్రం ముట్టుకుంటే పేలిపోయేలా కిలో రూ.50-60 ఉంది. కూరగాయల సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని కొంతమంది సాగుచేయడమే మానుకున్నారు. అంతేకాదు సాగుకు రసాయన ఎరువులు వాడివాడి పంటలు వేయకుండా 'క్రాప్ హాలిడే' ప్రకటించారు.

దళారులు నిర్ణయించిందే ధర! / కానరాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు / నేటి 'గ్రామీణ బంద్'లో అన్నదాత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఏటేటా వరి సాగు అన్నదాతల పాలిట ఉరితాళ్లవుతున్నాయి.. రైతే రాజు..దేశానికి పట్టెడన్నం పెట్టేది రైతన్నేనంటూ గొప్పలు చెప్పడమే తప్ప కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ప్రకటించే కనీస ఆలోచన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయడం లేదు. ఫలితంగా అన్నదాత ఆరుగాలం శ్రమ అప్పుల పాలవుతోంది. ధాన్యానికి గిట్టుబాటు ధర లేక దళారుల చేతుల్లో రైతు దగా పడాల్సి వస్తోంది. వర్షాభావ పరిస్థితులను, ప్రకృతి విపత్తులను తట్టుకుని..కష్టాన్నే నమ్ముకుని పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సరైన సమయంలో కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతన్నకు ఈ పరిస్థితి దాపురిస్తోంది. పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలనీ, నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని 2022లో ఢిల్లీలో రైతులు ఏడాది పాటు పోరాటం చేశారు. ఆ పోరాటంలో వందలాది మంది అన్నదాతలు అశువులు బాశారు. అయినా పాలకుల్లో ఎలాంటి కనికరం లేదు. అన్నదాతల పట్ల అదే నిర్లక్ష్యం..అదే నిర్లిప్తత. దీంతో అన్నదాత మరోసారి ఢిల్లీ వైపుగా పోరాట బాటపట్టాడు. వారికి మద్దతుగా దేశ వ్యాప్తంగా కార్మికులు, కర్షకులు శుక్రవారం గ్రామీణబంద్‌లో పాల్గొంటుండటం విశేషం.

- **కానరాని కొనుగోలు కేంద్రాలు**

రైతుకు అండగా నిలబడేందుకు 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. చంద్రబాబు హయాంలో ధాన్యం కొనుగోలు బాధ్యతను వెలుగు పథకం(డ్వాక్రా) ద్వారా నిర్వహించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టాక ధాన్యం కొనుగోళ్లను సహకార పరపతి సంఘాలతో పాటు వ్యవసాయ మార్కెట్లకు అప్పజెప్పింది. తర్వాత రైతు భరోసా కేంద్రాలు వచ్చిన తర్వాత అధిక శాతం వాటి నుంచే కొనుగోళ్లు చేసింది. అయితే తూర్పు మండలాల్లో ఈ సారి వర్షాలు సమృద్ధిగా పడటంతో రైతులు నవంబర్‌లోనే వరి సాగు మొదలు పెట్టారు. అవి ఇప్పుడు కోతకు వచ్చాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ధాన్యానికి మద్దతు(ఎంఎస్‌పీ) ధర ప్రకటించి ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేయలేదు.

- **దళారులు నిర్ణయించిందే ధర!**

ఏటా పెట్టుబడి, కూలీలు, ఎరువుల ఖర్చులు పెరుగుతున్నాయే తప్ప రైతు పండించిన ధాన్యానికి మాత్రం గిట్టుబాటు ధర మాత్రం పెరగడం లేదు. పదేళ్ల కిందట ఎకరా పొలంలో వరిని పండించేందుకయ్యే ఖర్చు రూ.10 వేలు కాగా ఇప్పుడు రూ.35 వేలకు చేరుకుంది. అయితే 75 కిలోల ధాన్యం బస్తాకు చెల్లిస్తున్న గిట్టుబాటు ధర మాత్రం రూ.1700 లోపే ఉంటోంది. గతేడాది గ్రేడ్–1 పరిధిలోకి వచ్చే వరి రకాలకు రూ.1727, సాధారణ రకాలకు రూ.1512 చెల్లిస్తానని చెప్పింది. అయితే మిల్లర్లు, దళారీలు సిండికేట్‌గా ఏర్పడి రైతులకు చెల్లిస్తున్న ధర మాత్రం రూ.1400 నుంచి రూ.1550 వరకు ఉంటోంది. ఈ ఏడాది జనవరిలో గ్రేడ్–1 వరి రకం 80 కిలోలకు రూ.2500 మద్దతు ధర పలికింది. ప్రస్తుతం వరి కోతలు ఊపందుకోవడంతో దళారీలు సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధరను ఏకంగా రూ.2100కు తగ్గించేశారు. ఈ నేపథ్యంలో గిట్టుబాటు ధర లేక పోయినా వేరే దారి లేక దళారులు నిర్ణయించిన ధరకే ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది.

- **త్వరలోనే ఏర్పాటు చేస్తాం: రమేష్‌బాబు, ఏడీఏ, శ్రీకాళహస్తి**

రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతి రాలేదు. తూర్పు మండలాల్లో ఎక్కువ మంది డిసెంబరు, జనవరి నెలల్లో మాత్రమే వరి నాట్లు వేస్తారు. అవి మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కోతకు వస్తాయి. ఈ ఏడాది మార్చి నెలలో ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చే అవకాశం ఉంది. మద్దతు ధర కూడా రైతులకు గిట్టుబాటయ్యే అవకాశాలే అధికంగా ఉంటాయి. రైతులు దిగులు పడాల్సిన అవసరం లేదు.

అప్పులే మిగులుతున్నాయి: రవి, రైతు, బోనుపల్లి గ్రామం

ఏడాదికి రెండు సార్లు ధాన్యాన్ని పండించినా అప్పులే తప్ప లాభం రావడం లేదు. రైతుల నుంచి ప్రభుత్వంధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని చాలా మందికి తెలియదు. తెలిసే లోపే అప్పులు గుర్తొచ్చి దళారులు ఇచ్చిన రేటుకే ధాన్యాన్ని అమ్మేసుకుంటున్నాం. విత్తనాలు, ఎరువులు, కూలీలు కలిపి పెట్టుబడి ధర వేలల్లో పెరిగింది. కానీ ధాన్యానికి మాత్రం ఏటా వందే పెరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యానికి కనీస మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలి.

తిరుపతి పురవీధుల్లో స్కూటర్ ర్యాలీ ప్రారంభిస్తున్న టి.సుబ్రమణ్యం

నేడు గ్రామీణ భారత్ బంద్

సిఐటియు, రైతుసంఘం స్కూటర్, ఆటోల ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం జరగనున్న దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని సిఐటియు, ఏపీ రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద స్కూటర్ ర్యాలీ జరిగింది. సిఐటియు జిల్లా నేత టి సుబ్రమణ్యం జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. తిరుపతి పుర వీధులలో బంద్ ను జయప్రదం కోరుతూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా సిఐటియు తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి కే వేణుగోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ రెండేళ్ల క్రితం మోడీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని రెండు వందల రైతు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న చలో ఢిల్లీ మార్చ్ పై పోలీసులు లాఠీ ఛార్జ్ చేసి రబ్బర్ బుల్లెట్స్ టియర్ గ్యాస్ ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండించారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన బిజెపి వాగ్దానం పదేళ్ల తరువాత కూడా అమలు చేయకపోవడం రైతులను మోసగించడం కాదా అని ప్రశ్నించారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా గిట్టుబాటు ధరల చట్టం తెస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం మాట తప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి బుజ్జి రఘు, ఆర్.లక్ష్మి, వాసు, రమేష్, మునిరజా, మాధవ్, అశోక్, అక్బర్, శ్రీను, రాధాక్రిష్ణ, సిద్దు, దనమ్మా, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో సిపిఎం కార్యాలయం వద్ద పట్టణ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. వివేకానందరోడ్డు, ముత్యాలపేట, రాజావీధి, గాంధీబొమ్మ, సంఘం థియేటర్ మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించరు. కరపత్రలను పంచిపెట్టారు. బివి రమణయ్య, ఎస్.సురేష్, సేలం శేఖరాచారి, జి.మధు, పెంచల ప్రసాద్, ఎ.ప్రసాద్, పామంజి మణి, బి.రమేష్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్‌లో...అంబేద్కర్ సర్కిల్ నుంచి ఆటో ర్యాలీని సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటేష్ ప్రారంభించారు. కనీస వేతనం 26వేలివ్వాలని, నాలుగు లేబర్‌కోడ్‌ల సవరణ బిల్లును రద్దుచేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. పురుషోత్తం, ఎ.విజయ్, రామలింగం, సురేష్, శివ, రము పాల్గొన్నారు.

ఎక్కడినుండో వచ్చి...సింహం నోటికి చిక్కి..

ఎస్వీ జూపార్కులో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

శ్రీవారి దర్శనానికి వచ్చాడా.. లేదంటే ఇంకైదైనా పనిపైన తిరుపతికి వచ్చాడో తెలియదు.. రాజస్థాన్ రాష్ట్రం బన్సూర్ ఆల్వార్ జిల్లా తురానా గ్రామానికిచెందిన ప్రహ్లాద్ గుర్జార్ (38) తిరుపతి జూపార్కులో సింహం నోటికి బలయ్యాడు. సందర్శకులతో పాటు వచ్చిన ప్రహ్లాద్ గుర్జార్ ఒక్కమాటున 12 అడుగుల ఎన్‌క్లోజర్ గేటు దూకేశాడు. దొంగల్ పూర్ అనే మగ సింహం ఒక్కసారిగా దాడికి ఎగబడింది. ఈ హఠాత్ పరిణామంతో బిత్తరపోయిన ప్రహ్లాద్ గుర్జార్ చెట్టుఎక్కే ప్రయత్నం చేశాడు. అయితే సింహం అతన్ని కింద పడేసి ఛాతి భాగంలో గట్టిగా కొరకవడంతో ప్రాణాలు విడిచినట్లుగా తెలుస్తోంది. తిరుపతి రూరల్ పోలీసులకు అందిన సమాచారం మేరకు రూరల్ డిఎస్‌పి శరత్‌రాజ్ కుమార్ విచారణ చేపట్టారు. ప్రహ్లాద్ గుర్జార్ మృతదేహాన్ని పోస్టుమార్గం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. మృతుడు మానసిక పరిస్థితి సరిగ్గా లేక సింహం బోనులో దూకాడా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్నది విచారణలో తేలాల్సి ఉంది. అయితే క్రూర మృగాలు ఉన్న చోట కనీసం సిసి కెమెరాలు లేకపోవడం గమనార్హం. సిసి కెమెరాలు ఉంటే ప్రహ్లాద్ గుర్జార్ ఏ విధంగా మృతిచెందాడనేది అప్పటికప్పుడే తెలిసుండేది. ఎన్‌క్లోజర్ పైకి ఎక్కి సెల్ఫీ తీసుకోడానికి ప్రయత్నించాడా? లేక మద్యం తాగి ఉన్నాడా? మతి స్థిమితం లేక పడిపోయాడా? అన్నది తెలియాల్సి ఉంది. ప్రహ్లాద చిరునామా సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దాడిచేసిన సింహాన్ని జంతుప్రదర్శనశాల బోన్‌లో బంధించారు.

తిరుపతిలో తాగునీటి ఎద్దడి

వేసవి ముందస్తు జాగ్రత్తలు ఏవి..?
మూడురోజులకు ఒకసారి సరఫరా
ప్రత్యామయంగా ట్యాంకర్లతో పంపణి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

తిరుపతి ఆధ్మాతిక నగరంలో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే కౌన్సిల్లో తాగునీటి సమస్యపై ముందస్తు చర్చించి వేసవి జాగ్రత్తలు తీసుకోకపోవడం గమనార్హం. గతంలో రోజుమార్చి రోజు తాగునీటిని వదిలేవారు. తాజాగా మూడు రోజులకోసారి వదులుతున్నారు. కొన్ని డివిజన్లలో అరగంట, మరికొన్ని డివిజన్లలో 45 నిమిషాలు సరఫరా చేస్తున్నారు. యూనివర్సిటీలు, ఆస్పత్రులకు మీటర్లు పెట్టి సరఫరా చేస్తున్నారు. నగరంలో మూడు లక్షల జనాభా ఉంది. తిరుపతికి రోజుకు 80వేల మంది యాత్రికులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన నీటి వనరులు తెలుగుగంగ. శ్రీకాళహస్తి కైలాసగిరి రిజర్వాయర్ నుంచి రామాపురం రిజర్వాయర్ ద్వారా దాదాపు 37 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. నగరంలో 12 ఫిల్టర్ ట్యాంకులు ఉన్నాయి. అమృత్ పథకంలో నిర్మించిన 11 ట్యాంకులున్నాయి. తెలుగుగంగతో పాటు చంద్రగిరి నియోజకవర్గంలో కల్యాణిడ్యాం ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు .రామాపురం రిజర్వాయర్ వద్ద విద్యుత్ సమస్య వస్తే తెలుగుగంగ నీటి సరఫరా సమస్య ఏర్పడుతుంది. వేసవిలో ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ సమస్యలు వస్తున్నట్లు నగర వాసులు మండిపడుతున్నారు.

3 ఎంఎల్‌డిలు కొరత



రోజుకు 65 ఎంఎల్‌డిల డిమాండ్ ఉంది. తెలుగుగంగ ద్వారా 44 ఎంఎల్‌డిలు, కల్యాణిడ్యాం ద్వారా 20 ఎంఎల్‌డిలు, 534 చేతిబోర్ల ద్వారా 1.47 ఎంఎల్‌డిల నీటిని అందిస్తున్నారు. మొత్తం 62 ఎంఎల్‌డిలు నీటిని సరఫరా చేస్తున్నారు. 3 ఎంఎల్‌డిల కొరత ఉంది. నీటి సమస్య ఉన్న డివిజన్‌లలో రోజుకు 16 నీటి ట్యాంకర్ల ద్వారా 0.75 ఎంఎల్‌డిల నీటిని సరఫరా చేస్తున్నారు. అమృత్ పథకంలో కొన్ని ట్యాంకుల నిర్మాణం ఇంకా పూర్తి కావాల్సి ఉంది. మురికివాడ ప్రాంతాల్లో నీటి సమస్య జఠిలంగా ఉంది. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా అరకొరగానే సరిపోతున్నాయని మహిళలు వాపోతున్నారు. మధ్యాహ్నం పూట ట్యాంకర్లను తీసుకురావడం వల్ల అప్పటికే కొంతమంది ఉద్యోగాలకు వెళ్లిపోవడం, షాపుల్లో పనులకు వెళ్లిపోవడం జరుగుతుంది. దీంతో ఆయా ఇళ్లల్లో తాగునీటి కొరత తప్పనిసరి. ఇక అపార్టుమెంట్‌వాసులు, వ్యాపార సముదాయం కలిగినవారు రూ.వెయ్యి నుంచి 5వేలు తక్కువ లేకుండా చెల్లించి నీటిని తెప్పించుకుంటున్నారు.

స్కాడ్కా సెంటర్ గాలికి..!

తిరుపతి అలిపిరి ఫిల్టర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన స్కాడ్కా సెంటర్‌ను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గాలికొదిలేశారు. స్కాడ్కా వల్ల ఎక్కడ తాగునీటి పైపులైన్ లీకేజికి గురవుతుందో కమాండ్ కంట్రోల్ ద్వారా పరిశీలించి లీకేజీలను మరమ్మతు చేసేవారు. అయితే ఇందుకు సంబంధించిన అగ్రిమెంట్‌ను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రెన్యువల్ చేసుకోలేదు.

నీటి సమస్య లేకుండ చర్యలు : మోహన్, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఇ

వేసవిలో తాగునీటి సమస్య లేకుండ చర్యలు తీసుకుంటాం. రామాపురం వద్ద గాలి వానకు విద్యుత్ సరఫరా సమస్య వచ్చి తెలుగుగంగనీటికి అంతరాయం కలిగింది. విద్యుత్ సమస్య ఏర్పడకుండ ఉండేందుకు ఎస్‌పిడిసిఎల్ అధికార్లతో సంప్రదించాం.

ఎంఎల్ఏ బియ్యపు మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

కరకంబాడి గుట్ట పైన పేదలకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - రేణిగుంట

రేణిగుంట మండలంలో జగనన్న పట్టాదారులైన అర్హులైన పేదలకు మండల పరిధిలోనే ఇంటి స్థలం చూపాలని, అదేవిధంగా కరకంబాడి గుట్ట పైన సుమారు నాలుగువేల మంది వేసుకున్న పేదల గుడిసెలకు ఇంటి పట్టా ఇవ్వాలని ఇంటిస్థలాల సాధన పోరాట కమిటి అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, సత్యశ్రీ డిమాండ్‌చేశారు. కరకంబాడి పర్యటనలో భాగంగా శ్రీ కట్ట పుట్టాలమ్మ గుడి వద్ద గురువారం మధ్యాహ్నం. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య,

ఎంఎల్ఏ బియ్యపు మధుసూదన్‌రెడ్డికి వినతి

మండల కార్యదర్శి హరినాథ్, కెవిపిఎస్ మండల కార్యదర్శి సెల్వరాజ్ నేతృత్వంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చి రేణిగుంట మండలంలో జగనన్న పట్టా లబ్ధిదారులకు జరిగిన అన్యాయం గురించి వివరించారు 153/1సర్వే నంబర్‌లో సిద్దుల రవి ఆక్రమించుకున్నారని, అక్రమ మైనింగ్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమండ్‌చేశారు. పది రోజుల్లోపు జగనన్న పట్టాదారులకు స్థలాలు చూపిస్తామని ఎంఎల్ఏ హామీ ఇచ్చారని హరినాథ్ తెలిపారు.

'ఈ' పంట నమోదును పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- ఏర్పేడు

ఏర్పేడు మండలంలోని నచ్చనేరి, నాగంపల్లి, అంజిమేడు గ్రామాల పరిధిలో తిరుపతి జిల్లా కలెక్టర్ వై.లక్ష్మీశ ఈ పంట నమోదును పరిశీలించి వెరిఫికేషన్ చేసి రైతులకు సంబంధించిన వివరాల గురించి, ఈ కేవైసీ నమోదు లోని లోటుపాట్లు గురించి అడిగి తెలుసుకుని రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు, శ్రీకాళహస్తి డివిజన్ ఏడిఏ రమేష్ రెడ్డి, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ షణ్ముఖం, ఆర్ఐ సంతోష్, భాగ్యలక్ష్మి, ఎంపీఈఓ సౌమ్య, ఏఈఓ ప్రదీప్ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలకై ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ ఏపీ ఎన్జీవోస్ ఆధ్వర్యంలో తిరుపతి రుయా ఆసుపత్రి వద్ద గురువారం ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఏపీ జెఎసి చైర్మన్ సురేష్ బాబు మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలగా ఉద్యోగులకు రావలసిన టీఏ, డిఏ, ఇతరత్రా బకాయిలు పెండింగ్ లోనే ఉన్నాయన్నారు. సుమారు 22 కోట్ల రూపాయలు బకాయిలు ఉందని, నాలుగు నెలల క్రితం 1 డిఏ విడుదల చేసిన ప్రభుత్వం, అరియర్స్ మాత్రం ఇంకా విడుదల చేయలేదన్నారు. తమ సమస్యలు చెప్పుకునేందుకు పోరాటం చేస్తున్న ప్రతిసారి చర్చలు పేరుతో పిలుస్తున్న ప్రభుత్వం బిస్కెట్లు చాక్లెట్లు ఇచ్చి పంపుతుందే తప్ప, తమ సమస్యలపై స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుండా పోతే ఈ నెల 27వ తేదీ మరోసారి భారీ స్థాయిలో చలో విజయవాడ చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ, నిర్మల, భువనేశ్వరి, వరలక్ష్మి పాల్గొన్నారు.

'జూడో'లకు స్టైఫండ్ 'బకాయిలు'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

బకాయిలు.. బకాయిలు.. ఇది రాష్ట్రంలో జరుగుతున్న నిరసన శిబిరాల వద్ద పదేపదే వినిపిస్తున్న పదం. ఇటీవల ఉపాధ్యాయులు ఆర్థిక బకాయిల కోసం ఆందోళన చేస్తుంటే, నిన్నమొన్న ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తాజాగా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే జూనియర్ వైద్యులకు ఆరునెలలుగా స్టైఫండ్ బకాయి పడి పేరుకుపోయింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లో పని చేయాల్సిన జూనియర్ వైద్యులు, సొంత ఖర్చులతో విధులకు హాజరుకాలేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వానికి, అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం శూన్యం. ఘనత వహించిన రుయాలో విధులు నిర్వహించే జూడోలు బకాయిల కోసం బాధపడుతూనే ఉన్నారు.

శ్రీవెంకటేశ్వర మెడికల్ కళాశాల. ఎంతో మంది ప్రముఖ వైద్యులను, మహనీయులను అందించిన ఘనత గలది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన మాజీ సిఎం డాక్టరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వంటి వారు ఆ కళాశాల నుంచే వైద్యపట్టా పొందారు. దీనికి అనుబంధంగా ఉన్న శ్రీవేంకటేశ్వర రామనారాయణ రుయా గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి (ఎస్‌విఆర్ఆర్‌జిజిహెచ్) రాయలసీమలోనే అదిపెద్ద పేదల ప్రభుత్వ ఆసుపత్రి. దీనికి తోడు రాష్ట్రంలోనే ఏకైక మహిళా ప్రసూతి వైద్యశాల, చిన్నపిల్లల ఆసుపత్రి ఉంది. ఎస్‌వి మెడికల్ కళాశాలలో చదువుకుంటూ ఈ మూడు ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తుంటారు జూనియర్ డాక్టర్లు. ఎస్‌విఎంసి పరిధిలో 200 మంది విద్యార్థులు ఎంబిబిఎస్ వైద్యవిద్యను అభ్యశిస్తున్నారు. వీరికి ప్రతి నెలా

ఆరు నెలలుగా నిరీక్షణ

స్టయిఫండ్‌గా ప్రభుత్వం 22వేల రూపాయలను మంజూరు చేస్తుంది. కానీ గత ఆరు నెలలుగా స్టయిఫండ్ విడుదల చేసిన పాపాన పోలేదు. తరచూ నెల, రెండు నెలలు ఆలస్యంగా స్టయిఫండ్ వచ్చినా వైద్య విద్యార్థులు ఎలాగోలా నెట్టుకొచ్చారు. గత ఆరు నెలలుగా రాకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. పైగా కర్నూలు, నెల్లూరు, నాయుడుపేట, గూడూరు ప్రాంతాల్లో వీరు అప్రెంటీస్ పద్దతిలో విధులు నిర్వహించేందుకు వెళ్లాలి. దీనికి అదనంగా ఎలాంటి టిఏ, డిఏలు ఇవ్వరు. తప్పని పరిస్థితుల్లో సొంత ఖర్చులతోనే దూర ప్రాంతాల్లో సైతం విధులకు హాజరవుతారు. కానీ ఆరు నెలలుగా స్టయిఫండ్ విడుదల కాకపోవడంతో ఇంటి నుంచి ఖర్చులుగా డబ్బులు తెచ్చుకోలేక, అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పైగా మరో 15 ,20 రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. ఈ నేపథ్యంలో తమ బకాయిలు మాట పరిస్తితి ఏంటో అర్థం కానీ పరిస్థితి. రుయా అధికారుల వల్లే జూడోలకు ఈ పరిస్థితి దాపురించింది. సరైన సమయంలో తమకు సంబంధించిన రికార్డులు ఉన్నతాధికారులకు చేర్చకపోవడం వల్లే నేడు జూడోలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు ఏదోలా చేస్తారని సరిపుచ్చుకున్న వైద్య విద్యార్థులు అనేక సార్లు విన్నవించిన పట్టించుకోకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో పోరాటాలకు సిద్ధమయ్యారు. నాలుగైదు రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే దశలవారీ విధులు బహిష్కరిస్తామని, అందర్ని కలుపుకుని సమ్మె బాట పడతామని తాజాగా అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.

జూడోల నిరసన

జూనియర్ డాక్టర్ల నిరసన

స్టైఫెండ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ జూనియర్ డాక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక రుయా ఆసుపత్రి పరిపాలన భవనం ఎదుట గురువారం జరిగిన కార్యక్రమంలో జూడోల ఉపాధ్యక్షులు వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబర్ నెల నుంచి తమకు స్టయిఫండ్ విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తాము ఇబ్బందులు పడ్డామన్నారు. ప్రతినెలా తమ సమస్యలు స్థానిక అధికారులకు విన్నవించిన ఫలితం శూన్యం అన్నారు. జనవరి మూడో తేదీ నిరసన తెలిపినా స్పందించలేదని, ఇప్పుడు మరోసారి నిరసనకు దిగాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మూడు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే, విద్యార్థులందరినీ కలుపుకొని సమ్మె బాట పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భార్గవ్, ఇద్రాష్, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

రేపు వలంటీర్లకు సేవా పురస్కారాలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: అత్యుత్తమ సేవలందించిన గ్రామ సచివాలయ వలంటీర్లకు సేవా పురస్కారాలు అందించనున్నట్లు ఎంపీడీవో శౌలిట్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు ఎంపీడీవో కార్యాలయం వద్ద సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పురస్కారాలు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికురాలి మృతికి నివాళి

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీలో పారిశుద్ధ కార్మికురాలుగా విధులు నిర్వహిస్తున్న నిర్మలమ్మ బుధవారం రాత్రి ఆకస్మిక మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు చాపల వెంకటేశ్వర్లు ఆమె స్వగ్రామం విన్నమాలకు చేరుకొని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృతురాలు కుటుంబానికి సహజ మరణం కింద రూ.ఐదు లక్షలు ఇవ్వాలని కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని అలాగే నివాసం స్థలం ఏర్పరచాలని ఆయన కోరారు. ఆయన వెంట నాయకులు నెలవల హరి, మధు, లచ్చమ్మ ఉన్నారు.

సచివాలయం ఉద్యోగికి సేవా వజ్ర అవార్డు

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని పాత వీరాపురం సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్. మునిశేఖర్‌కి సేవ వజ్ర అవార్డు లభించింది. గురువారం డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

రేపు స్టాటిస్టికల్ డేటా సైన్స్ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతిలో నిరుద్యోగ యువతకు మంచి భవిష్యత్తును అందించాలని దృఢ సంకల్పంతో ఏర్పాటు చేసిన ఇండియన్ సొసైటీ ఫర్ ప్రొబబిలిటి అండ్ స్టాటిస్టిక్స్ డేటా సైన్స్ సెంటర్‌ను శనివారం ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ గౌరవ అధ్యక్షులు ప్రొ.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ డేటా సైన్స్ భవన ప్రారంభోత్సవానికి నేషనల్ చీఫ్ స్టేటిస్టిషియన్ జీపి.సమంత ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. అతిథులుగా తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కెవిఎన్.సత్యనారాయణ, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా కాలిఫోర్నియా రాష్ట్రం నుండి ప్రొఫెసర్ భారీ సి ఆర్నాల్డ్, ఐఎస్ పిఎస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎస్ సి. మాలిక్, యూఎస్‌ఏ ఫ్లోరిడా రాష్ట్రం నుండి ప్రొఫెసర్ జె.సేతురామన్, పద్మావతి మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజనీ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఔత్సాహిక విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.

వేలం పాటలో రూ.62లక్షల ఆదాయం

ప్రజాశక్తి-ఏర్పేడు: ఏర్పేడు పంచాయతీకి సంబంధించిన దుకాణాల వేలం పాటలో రూ.62లక్షలు ఆదాయం వచ్చిందని ఈవోపీఆర్‌డీ రమణకుమార్ తెలిపారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నల్లపాలెం శివయ్య అధ్యక్షతన వేలం పాట జరిగింది. మొత్తం 31గదులకు వేలం నిర్వహించగా అందులో 24గదులకు పాట ద్వారా రూ.62,11,106లు ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. మిగిలిన దుకాణాలకు మరో రెండు వారాల్లో తిరగి వేలం పాట నిర్వహిస్తామని చెప్పారు.

సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ టైలరింగ్ కోర్సులు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. స్థానిక తిరుచానూరు రోడ్‌లోని మహిళా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి దుర్గాబాయి మహిళ, శిశు విజ్ఞాన కేంద్రం జిల్లా మేనేజర్ ఫర్జన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ టైలరింగ్ పథకంలో భాగంగా మహిళలకు టైలరింగ్ కోర్సుల్లో తర్ఫీదు ఇచ్చామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో అందజేసే కోర్సులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, జ్యోతి, లోకనాథం పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర ప్రభుత్వం 4వ విడత వైఎస్సార్ ఆసరా నిధులు మంజూరు చేయడంతో గురువారం డ్వాక్రా మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండలంలోని పల్లమాల సర్పంచ్ జె.రమణమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సత్యవేడు అభ్యర్థి రాజేష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-కోట: మండలంలోని కొత్తపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఎంఈవో మస్తానయ్య మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. లోపాలు లేకుండా భోజనం తయారు చేసి విద్యార్థులకు అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి. కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

'బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోండి'

ప్రజాశక్తి-గూడూరు రూరల్: తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా సౌకర్యం సదుపాయాన్ని తపాలా శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్నామని, పోస్టల్ బీమా పరిహారం రూ.10లక్షలు అందజేసినట్లు సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి కటారి తెలిపారు. గురువారం తపాలా శాఖ ద్వారా ఆక్సిడెంట్ పాలసీ చేసుకొని ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తి కుటుంబానికి ప్రమాద బీమా పరిహారం రూ.10లక్షల చెక్కును గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎ.ఎస్.పి మణిగండన్, శరత్‌కుమార్, మేనేజర్ వేణు, అసిస్టెంట్ మేనేజర్ గురుభవాన్ పాల్గొన్నారు.

'సిపాయి' భరోసా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని పూసలవీధికి చెందిన షేక్ చాన్ బాషా కుటుంబాన్ని ఎమ్మెల్యే బి.సిపాయి సుబ్రమణ్యం గురువారం పరామర్శించారు. చాన్‌బాషా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సిపాయి భరోసా కింద 40 రకాల నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో పీవీఆర్ (గ్రూప్ డైరెక్టర్ జనార్దన్ రావు పవర్, వద్ద తాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి, రత్నం రెడ్డి, షేక్ పావన్ షరీఫ్, కంటా డేవిడ్, డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు బస్తాల వితరణ

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని మాధవ మాల గ్రామంలో నిర్మిస్తున్న గంగమ్మ గుడి నిర్మాణానికి టిడిపి నాయకులు బోలినేని జగన్నాథనాయుడు సిమెంట్ బస్తాలను వితరణ చేశారు.

బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ

ప్రజాశక్తి-రేణిగుంట: బాల్య వివాహాల నిర్మూలనలో భాగంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గురువారం పట్టణంలో ఈ ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో సీడీపీఓ హేమావతి, అంగన్వాడి సూపర్వైజర్లు, భారతి, రత్నమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

'ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉండాలి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రతి ప్రభుత్వ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఉండాలని జిల్లా కమిషనర్ ఎంఎంరెడ్డి అన్నారు. స్థానిక బాబు అగ్రహారం మున్సిపల్ హైస్కూల్లో గురువారం స్కౌట్స్ అండ్ గైడ్స్ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏర్పేడు, తొట్టంబేడు, శ్రీకాళహస్తి, బుచ్చినాయుడు కండ్రిగ, కేవీబీ.పురం, తడ మండలాల నుండి 230మంది ఉపాధ్యాయులు పాల్గొని శిక్షణ తీసుకున్నారు. సందర్భంగా ఎంఈఓ భువనేశ్వర్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవశ్యకతను వివరించారు.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ హోం అఫైర్స్ బృందం రాక

- ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ హోం అఫైర్స్ బృందం తిరుమల, తిరుపతి పర్యటనకు వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. విధులు కేటించిన అధికారులు అప్రమత్తంగా నిర్వర్తించాలని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జెసి శుభం బన్సల్, అదనపు ఎస్పీ కులశేఖర్‌లతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 19, 20 వ తేదీలలో కమిటీ బృందం రాజ్యసభ, లోక్ సభ నుండి మొత్తం 30మంది సభ్యుల తిరుమల, తిరుపతి పర్యటనకు ఆన్ ది స్పాట్ విపత్తు నిర్వహణపై స్టడీ కొరకు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు ఉండాలన్నారు. శ్రీవారి ఆలయం ఆన్ ది స్పాట్ విపత్తు నిర్వహణపై స్టడీ చేయనున్నారని తెలిపారు. వారికి అతిథి మర్యాదలు ప్రోటోకాల్, తగినంత బందోబస్తు తదితర ఏర్పాటు ఉండాలన్నారు. బృందానికి బ్రిజ్‌లాల్ రాజ్యసభ ఎంపీ సారథ్యం వహించనున్నారని, ప్రతి సభ్యునికి ఒక లైజన్ అధికారిని నియమించడం జరిగిందన్నారు. జిల్లా విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖ అధికారి తగినంత ఫైర్ ఫైటింగ్, విపత్తు నిర్వహణ పరికరాల ఏర్పాటు ఉండేలా చూడాలన్నారు. ట్రాన్స్పోర్ట్, వైద్య అధికారులు తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వారు టీటీడీ సిపిఆర్వో మరియు ఎస్వీబీసీ సమన్వయంతో స్టెనోగ్రఫర్ ఏర్పాటు ఆడియో వీడియో రికార్డింగ్ ఏర్పాట్లు చూడాలని ఆదేశించారు. టీటీడీ అధికారులు మాట్లాడుతూ పార్లమెంట్ బృందానికి ఈఓ గారి ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ తగినంత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్డిసి భాస్కర్‌నాయుడు, రాంమోహన్, డిఎఫ్ఓ రమణయ్య, డిఎంహెచ్ఓ శ్రీహరి, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపెంద్రనాథ్ రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి ఆది నారాయణరెడ్డి, డిఐపిఆర్ఓ బాల కొండయ్య, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ వైద్యుల నియామకం

ప్రజాశక్తి-తిరుపతిసిటీ: ఎస్వి వైద్య కళాశాలకు సూపర్ స్పెషాలిటీ విభాగాలకు కొత్తగా అసిస్టెంట్ ప్రొఫెసర్లను, ప్రొఫెసర్లను ప్రభుత్వం గురువారం నియమించింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ రుయా ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించెందుకు మెడికల్ ఆంకాలజీలో 01 అసిస్టెంట్ ప్రొఫెసర్, సర్జికల్ ఆంకాలజీ: 01 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నెఫ్రాలజీ : 02 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, యూరాలజీ : 02 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, న్యూరో సర్జరీ : 02 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, న్యూరాలజీ:02 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కార్డియాలజీ :01 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్లాస్టిక్ సర్జరీ: 01 ప్రొఫెసర్, 02, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రిడియాట్రిక్ సర్జరీ: 02 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కార్డియోథోరాసిక్ సర్జన్ విభాగంలో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ నియమించినట్లు వెల్లడించారు.

ఆక్రమణల కూల్చివేత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతిరూరల్ మండలంలోని తుమ్మలగుంట పరిధిలోని శ్రీ స్వామీ హాథీరాంజీ మఠంకు చెందిన భూమిలో ఆక్రమణలను మఠం డిప్యూటీ కలెక్టర్, ఫిట్ పర్సన్ కె.రమేష్ నాయుడు ఆదేశాల మేరకు మఠం సిబ్బంది, రెవెన్యూ అధికారుల సహాయంతో నిర్మాణ గోడలను కూల్చివేశారు. అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మఠం ఫిట్ పర్సన్ రమేష్‌నాయుడు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, తహాశీల్దార్ మహబూబ్ చాంద్, మఠం సిబ్బంది సీతారామయ్య, మునివెంకటేష్, మధు పాల్గొన్నారు.

మైనారిటీల అభివృద్ధికి కృషి: రోజా

- పుత్తూరులో షాదీమహల్ ప్రారంభం

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ముస్లిం మైనారిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం పుత్తూరు పట్టణంలోని తిరుపతి-నగరి రహదారిలో రూ.1.85కోట్లు వ్యయంతో నిర్మించిన షాదీమహల్‌ను డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ జకియా ఖాన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. దేశ చరిత్రలోనే ఎవరికీ సాధ్యం కాని ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత వైఎస్సార్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రభుత్వంలో ముస్లింలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ప్రోత్సహించి, వారిలోని పేదరికం నిర్మూలించేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో మరో సారి వైసీపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహీన్, మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్ జయప్రకాష్, శంకర్, ఎంపీపీ మునివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుత దేవరాయమార్గం ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతిలోని రహ దారు లకు తిరుమల శ్రీవారికి సేవలందించిన మహనీ యుల పేర్లను పెట్టడం శుభకరమని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి అన్నారు. తిరుపతి ముని సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా నూత నంగా నిర్మించిన అచ్యుత దేవరాయ మార్గాన్ని గురువారం భూమన కరుణాకర్‌రెడ్డి, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణలు ప్రారంభించారు. మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ,కమిషనర్ అదితి సింగ్ మాట్లాడుతూ 51 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిం చిన సిసి రోడ్డు అచ్యుత దేవరాయల మార్గము అందుబాటులోకి రావడం వలన ఒక మంచి కనెక్టివిటి రహదారి ప్రజలకు ఉపయోగంలోకి వచ్చిందన్నారు. కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, బస్వాగీత, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె.బాబు పాల్గొన్నారు.

సంగీతాభ్యసనలో టెక్నాలజీ పాత్ర కీలకం

- రసరిషి అధ్యయన కేంద్రం ప్రొఫెసర్ డా. నందకుమార్

ప్రజాశక్తి-క్యాంపస్: సంగీతాభ్యసనలో టెక్నాలజీ పాత్ర ఎంతో కీలకంగా మారిందని, విద్యార్థులు దాన్ని అందిపుచ్చుకుని సాధన చేయాలని కర్ణాటకలోని రసరిషి అధ్యయన కేంద్రం ప్రొఫెసర్ డా.నందకుమార్ సూచించారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాల ఆధ్వర్యంలో తిరుపతి మహతి కళామందిరంలో కళావైభవం పేరిట నిర్వహిస్తున్న దక్షిణ భారత సంగీత నృత్యోత్సవం గురువారం రెండో రోజుకు చేరుకుంది.

ఆకట్టుకున్న పంచవాద్య సంగీతం

ఈ సందర్భంగా చెన్నై డా.జె.జయలలిత మ్యూజిక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు నాదస్వరం, వీణ, వయొలిన్, మృదంగం, కంజీరా వాద్యాలతో పంచ వాద్య సంగీతాన్ని లయబద్ధంగా ప్రదర్శించారు.

క్షత్రియ భవనానికి భూమి పూజ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రవ్యాప్తంగా క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన వారికి ఉపయుక్తంగా అన్ని సదుపాయాలతో దాదాపు పది కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన క్షత్రియ భవనంకు గురువారం ముఖ్య క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, రాష్ట్రీయ క్షత్రియ సమితి నాయకుల ఆధ్వర్యంలో తూకివాకం దగ్గర ఘనంగా భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ క్షత్రియులు సేవాగుణ తత్పరులని, ఎంతో ఉదాసీనంగా దానధర్మాలు చేసిన క్షత్రియులు అందరూ నేడు ఐక్యంగా ఉంటూ తిరుపతికి వచ్చే క్షత్రియ బాంధవులకు తగిన ఆతిథ్యం లభించడానికి క్షత్రియ భవనం ఎంతో ఉపకరిస్తుందన్నారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్షత్రియులను బీసీలుగా గుర్తించాలని సీఎం జగన్‌కు వినతి ఇవ్వనున్నమన్నారు. ఇప్పటికే సీఎం జగన్ క్షత్రియులకు బీసీ హోదా కల్పిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. సమితి గౌరవ అధ్యక్షులు సూరప్ప శివరామరాజు, అధ్యక్షులు బలరామరాజులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్షత్రియులందరూ ఐక్యంగా ఉండి అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. క్షత్రియ భవనానికి విరివిగా విరాళాలు అందించి తమ దాతృత్వాన్ని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త మనోహర్‌రాజు, సుబ్రమణ్యంరాజు, రుద్రరాజు శ్రీదేవి, నాగేశ్వరరావు, సిద్ధార్థ కాలేజ్ అధినేత అశోక్‌రాజు పాల్గొన్నారు.

శ్రీనివాస మైనింగ్‌కు అనుమతులు ఇవ్వొద్దు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: మండలంలోని పరిధిలోని చెన్నూరు గ్రామ పరిధిలో ఉన్న శ్రీనివాస మైనింగ్‌కు ప్రజాభిప్రాయం మేరకే అనుమతులు ఇవ్వాలని గ్రామస్థులు, ప్రజాసంఘాల నాయకులు విన్నవించారు. అనంతరం డిఆర్వో పెంచల్ కిషోర్‌కు, జిల్లా కాలుష్య నియంత్రణ అధికారులకు వినతి పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా మైనింగ్ భాగస్వామి తుమ్మతాటి విజయ భాస్కర్ మాట్లాడుతూ మైనింగ్ లో తొమ్మిది మంది భాగస్వాములుగా 2013 వ సంవత్సరం నుండి కార్యకలాపాలు కొనసాగిస్తున్నా మన్నారు. ఇటీవల తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కొంత మంది అక్రమంగా మైనింగ్ చేస్తున్నారన్నారు. దీని వలన తాను నష్ట పోయానని పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని అధికారులకు ప్రజాభిప్రాయ సేకరణలో విన్నవించారు. అనంతరం ప్రజా సంఘాల నాయకులు దేగ రవిరాఘవేంద్ర మాట్లాడుతూ పబ్లిక్ హియరింగ్ సమావేశం గురించి చుట్టు పక్కల గ్రామాల్లో దండోరా వేయలేదని, ఇంత గోప్యంగా జరపవలసిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మైనింగ్ సమీపంలో ఎస్సీ ఎస్టీలు జీవిస్తున్నారని, ఈ మైనింగ్ వలన జరిగే పొల్యూషన్ వల్ల అనారోగ్య సమస్యలు గురై మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రజల జీవనానికి నష్టం కల్గించే మైనింగ్ కు అనుమతులు ఇవ్వొద్దని అధికారులను కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు మాకని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-దొరవారిసత్రం: చెన్నై-కలకత్తా జాతీయ రహదారిపై ఆటోను ఓ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర రక్త గాయాలతో ఆసుపత్రి పాలైయ్యారు. పోలీసుల కథనం మేరకు.. తనియాలికి చెందిన వెంకటేశ్వరు (47), వీరాస్వామి సొంత పనులు ముగించుకొని సూళూరుపేట నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా చెన్నై-కలకత్తా జాతీయ రహదారి (మావిళ్ళపాడు సమీపంలో) చెన్నై నుండి హైదరాబాద్‌కు వెళుతున్న ఓ ట్రావెల్ బస్సు ఆటోని ఢీకొంది. ఘటనలో ఆటో నడుపుతున్న వెంకటేశ్వర్లు(47) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో వీరాస్వామికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. ఇంతలో సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలం నుంచి ఆపకుండా వెళ్లిపోతున్న బస్సును ఓజిలి మండలం భోజనం టోల్ ప్లాజా వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై ఎస్ఐ తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విలేకరికి గాయాలు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: రోడ్డు ప్రమాదంలో విలేకరి గాయపడ్డ సంఘటన గురువారం పుత్తూరు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన బాలాజీ ఓ దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్నారు. రోజువారి కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోకి వెళ్లారు. అధిక ట్రాఫిక్‌లో వరుసగా వాహనాలు రావడంతో అదుపుచేసే క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో అతని కాలుకి గాయమైంది. పట్టణంలో రోజురోజుకీ ట్రాఫిక్ పెరిగి ఇలాంటి సంఘటనలు అధికంగా జరుగుతున్నా పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు స్థానికంగా వెల్లువెత్తుతున్నాయి.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న వ్యక్తి నుంచి బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్‌పీఎస్ ఎస్ఐ కొండపనాయుడు పేర్కొన్నారు. గురువారం ఆయన వివరాలను వెల్లడిస్తూ.. సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం గూడూరు రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫామ్‌పై తనిఖీలు చేపట్టామన్నారు. నెల్లూరుకు చెందిన కృష్ణ వద్ద 39మద్యం బాటిళ్లను గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. బెంగళూరు నుంచి తక్కువ ధరకు తెచ్చి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పాత కక్షలతో వడ్డీ వ్యాపారి దారుణ హత్య

ప్రజాశక్తి-రామచంద్రాపురం(తిరుపతి రూరల్): రూరల్ మండలం, మల్లంగుంటలో పాత కక్షలతో వడ్డీ వ్యాపారి నిరంజన్(36) దారుణ హత్యకు గురైయ్యాడు. బైరాగిపట్టెడకు చెందిన నిరంజన్ గురువారం ఉదయం తన కారులో మద్యం బాటిల్స్ తీసుకొని మల్లంగుంట స్మశానం వాటిక ఎదురుగా ఉన్న తుడా ప్లాట్స్ వద్దకు వెళ్లాడు. సాయంత్రం వరకు అక్కడే హరిజనవాడ చెందిన నరేష్, లోకేష్, నాని, చందు, కృషి, జస్వంత్ మద్యం సేవించారు. నిరంజన్ మూడు గంటలకు ఇంటికి వెళ్లి భోజనం చేసి తిరిగి అదే చోటికి వచ్చిన కొంత సమయం వేచి ఉన్నాడు. నిరంజన్ నగరంలో చాలామందికి వడ్డీలకు అప్పుగా డబ్బులు ఇచ్చేవాడు. మలంగుంటకు చెందిన సోముకి నిరంజన్‌కి పాతకక్షలు ఉన్నాయి. నిరంజన్ మద్యం మత్తులో ఒంటరిగా ఉన్న విషయాన్ని గ్రహించిన సోము పాత కక్షలు కారణంగా నిరంజన్‌ను కత్తితో నరికి, గొంతు కోసి అతి కిరాతకంగా హత్య చేశాడు. నిరంజన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కత్తితో నరకడంతో సంఘటన స్థలం రక్తమయం అయింది. సంఘటన స్థలం వద్ద, కారు, మద్యం సీసాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న సీఐ ఇమామ్ అహ్మద్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిరంజన్‌ను హత్య చేసింది సోము అని పోలీసుల విచారణలో నిర్ధారణ అయింది. కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

'జంగమ కులస్తులంతా ఏకతాటిపైకి రావాలి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జంగమ కులస్తులందరూ ఒక తాటిపైకి వచ్చి సముచిత ప్రాధాన్య హక్కులను సాధించుకోవడానికి ఐక్య పోరాటంకు సిద్ధం కావాలని జంగం దేవర్ల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా కన్వీనర్ బాబ్జి విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ జంగమ కులవృత్తిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జంగమలకు ఆదరణ కరువైన ప్రస్తుత నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఉన్న జంగం కులస్తులను జాగృతి చేయడానికి రాష్ట్రవ్యాప్త పర్యటన చేయడానికి తమ సంఘం జిల్లాల కన్వీనర్ల నియామకమును చేపట్టామన్నారు. చిత్తూరు జిల్లా కన్వీనర్ సాంబయ్యను నియమించామన్నారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి దేవస్థానాల్లో జంగం కులస్తులకు సముచిత ప్రాధాన్యమిచ్చి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మజీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హరితమ్మకు జోహార్లు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయినా ఓ మహిళా అవయవాలను ఇతరులకు దానం చేసి, వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారు. రామచంద్రాపురం మండలం కమ్మపల్లి (మా) గ్రామానికి చెందిన బోల్లేపల్లి మురళి సతీమణి హరిత(36) మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరారు. వైద్యులు పరిశీలించి ఆమె బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసిన వైద్యులు వారిలో అవయవదానంపై అవగాహన పెంచారు. బుధవారం కుటుంబ సభ్యులు అంగీకారంతో తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి, రుయా ఆసుపత్రికి అవయవాలు దానానికి అంగీకరించారు. ఆసుపత్రి మాజీ వర్కింగ్ ఛైర్మన్ చిన్నబాబు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల్ని ఒప్పించి సూపరింటెండెంట్‌ని సంప్రదించి కంటి విభాగానికి కళ్లదానం చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభ మాట్లాడుతూ గత రెండు రోజులు క్రితం ఇదే విధంగా ఒక యువకుడు చనిపోవడం జరిగింది, వారు కూడా కళ్ళు దానం చేశారన్నారు. ఇలాంటి అవయవదానం చేసే వారివల్ల పదిమందికి ప్రాణం పోసినట్లు అవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ బ్యాంక్ టెక్నీషియన్ రమేష్, ఎస్వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

దక్షిణాది అంటేనే బిజెపికి పట్టదు

- సీమకు నికర జలాలిచ్చే వారికే మద్దతివ్వండి: సురేష్ బాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దక్షిణాది రాష్ట్రాలంటేనే కేంద్రంలోని బిజెపికి చిన్న చూపు అని, అందులోనూ వెనుకబడిన రాయలసీమను అభివృద్ధి చేస్తామని మాటల్లో చెబుతారు తప్ప నిధులు ఇచ్చిన పాపానపోలేదని ప్రత్యేక రాయలసీమ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కూరపాటి సురేష్‌బాబు విమర్శించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం రాయలసీమ పట్ల చూపుతున్న సవతి ప్రేమకు అనంతపురం జిల్లా ప్రస్తుతం సగం ఎడారిగా మారిపోయిందని, రాయలసీమ ప్రాంతానికి కృష్ణా నికర జలాలు అందించే రాజకీయ పార్టీకే రాయలసీమ ప్రజలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాల కాలంగా రాయలసీమ నుండి ప్రాతినిధ్యం వహించి సీఎంగా పనిచేసిన వారు కూడా ఈ ప్రాంతానికి న్యాయం చేయకపోవడం దురదృష్టకరమన్నారు. నీరు లేక సరైన పని లేక నిరుద్యోగులు వలస బాటలు పడుతూ పక్క రాష్ట్రాలలో కాలం నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు అబ్దుల్ రఫీ, నరేష్, నాగరాజ రెడ్డి పాల్గొన్నారు.

గల్లాను కలిసిన ఎస్‌సీవీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ మంత్రి గల్లా అరుణకుమారి కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే ఎస్‌సీవీ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. పేటమిట్ట వద్ద సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. తొట్టంబేడు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మస్తాన్

ప్రజాశక్తి-రేణిగుంట: వైసీపీ జిల్లా ముస్లిం మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా షేక్ మస్తాన్ నియమితులయినట్లు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రసూల్ తెలిపారు. గురువారం మండల పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే మస్తాన్‌ను అభినందించారు.

ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలను తిరుపతిలోని శ్రీ స్వామి హాథిరాంజి మఠంలో రాష్ట్ర బంజారా నాయకులు మూడే హరి చౌహాన్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మఠం డిప్యూటీ కలెక్టర్, ఫిట్ పర్సన్ రమేష్‌నాయుడు జయంతి వేడుకల్లో పాల్గొని సంత్ సేవాలాల్ మహారాజ్‌కు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా హరిచౌహాన్ నాయక్ మాట్లాడుతూ బంజారాలకు ఆరాధ్య దైవంగా నమ్మే సంతు సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు రోజుగా ప్రకటించాలన్న బంజారాల విజ్ఞప్తిని సీఎం జగన్ పరిశీలించి సెలవుదినంగా ప్రకటించి అధికారిక ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అనంతపురం జిల్లాలోని సంతు సేవాలాల్ మహారాజ్ సేవగడ్ వద్ద రాష్ట్ర బంజారా సంఘాల నాయకత్వంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకుందాం: ఎమ్మెల్యే మధు

ప్రజాశక్తి-రేణిగుంట: వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని ఎమ్మెల్యే బియ్యపు మధుసుదన్‌రెడ్డి అన్నారు. గురువారం రేణిగుంట మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. వివిధ చోట్ల నిర్మించిన సచివాలయ భవనాలు, విలేజ్ క్లినిక్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేసిన అభివృద్ధిని గుర్తించి వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, సంధ్యారాణి, రమేష్, సుజాత, శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్, గణేష్‌రెడ్డి, బాబ్జీరెడ్డి, నగేశం, మునిశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూములు పంచండి: సీపీఎం

ప్రజాశక్తి-వెంకటగిరిరూరల్: మండలంలోని పెట్లూరు సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో పంచాయతీలోని మిగులు భూములను పంచాలని గురువారం ధర్నా చేపట్టారు. గ్రామాన్ని ఆనుకుని ఉన్న 519ఎకరాలు ప్రభుత్వ మిగులు భూముల్ని సెంటు భూమిలేని దళిత, గిరిజనులకు ఇతర సామాజిక తరగతుల వారికి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి వెంకటగిరి ఏరియా ఆర్గనైజర్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ పెట్లూరు గ్రామ పరిధి సర్వే నెంబరు 1లో 238 ఎకరాల 98సెంట్లు, సర్వే నెంబర్ 12-1లో 519.92సెంట్లు ప్రభుత్వ భూములు ఉన్నట్లు చెప్పారు. భూమి లేని నిరుపేదలకు రెండు ఎకరాల చొప్పున పంపిణీ చేయాలని కోరారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇవన్నీ పరంబోకు భూములుగానే ఉన్నాయని గుర్తు చేశారు. అనంతరం పేదలు తెచ్చిన అర్జీలను సచివాలయంలో వీఆర్వోకి అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ, కార్మిక సంఘం నాయకులు కృష్ణయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి ఆలయంలో రథసప్తమికి సర్వం సిద్ధం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం రథసప్తమి పర్వదినం నిర్వహణకు సర్వం సిద్ధమైంది. శ్రీవారి ఆలయంతోపాటు అన్నప్రసాదం, నిఘా, భద్రత, ఇంజినీరింగ్, ఉద్యానవన తదితర విభాగాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. సప్త వాహనాలపై స్వామివారి వైభవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేయనుండడంతో అందుకు తగ్గట్టు టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామున కైంకర్యాలు పూర్తయిన తరువాత ఉదయం 4.30 గంటలకు శ్రీమలయప్ప స్వామివారు ఆలయం నుండి వాహనమండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ విశేష సమర్పణ చేపడతారు.

'జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి'

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర తెలిపారు. గురువారం న్యాయవాదులతో సబ్‌కోర్టు ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబోతున్నట్లు వివరించారు. రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని దానిపై అప్పీల్ ఉండదని తెలిపారు. ఇందులో అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేసుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జై భారత్ పార్టీ కో ఆర్డినేటర్ నియామకం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జై భారత్ నేషనల్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామానికి చెందిన రొమ్మాల నిరంజన్ రెడ్డి నియమితులయ్యారు. జేబీఎన్పీ అధినేత వి.వి.లక్ష్మీనారాయణ విజయవాడలో బుధవారం ఆ మేరకు నిరంజన్ రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. నిరంజన్‌రెడ్డి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారని తెలిపారు. నిరంజన్ రెడ్డికి కో-ఆర్డినేటర్‌గా పదవి దక్కడంపై గురువారం పలువురు అభినందించారు.

గాలి భానును కలిసిన కోఆప్షన్ సభ్యులు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పుత్తూరు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు చేరాలు గురువారం నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్‌ను కలిశారు. ఈ సందర్భంగా శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనతో పాటు పెద్దబ్బ, మునికుమార్, ఆనంద్, గుర్రప్ప, జీవరత్నంనాయుడు, ధనపాల్, షణ్ముగంరెడ్డి, హరి పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం

ప్రజాశక్తి తిరుపతి సిటీ: మాజీ అసెంబ్లీ స్పీకర్ కుతూహలమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా జెన్ అకాడమీ ఆధ్వర్యంలో రోగులకు వారి సహాయకులకు అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన అకాడమీ అధ్యక్షులు, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ మాట్లాడుతూ మాజీ స్పీకర్‌గా కుతూహలమ్మ తన సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని నిరాడంబరంగా గడిపారన్నారు. రాజకీయాల్లో నిజాయితీగా వ్యవహరిస్తూ, ప్రజలకు సేవ చేయడంలో ఆమె ఎంతో ఆత్మ సంతృప్తి చెందేవారిని, ఆమెను స్ఫూర్తిగా తీసుకొని రాజకీయాల్లోకి ప్రవేశించానన్నారు. ప్రథమ వర్ధంతి సందర్భంగా రోగులకు వెయ్యి మందికి అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కిరణ్, రాజా, అకాడమీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

ప్రజాశక్తి-రేణిగుంట: ఈవీఎం గోడౌన్ వద్ద నిరంతర పటిష్టమైన నిఘా, భద్రత యధావిధిగా కొనసాగించాలని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అన్నారు. గురువారం రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని గోడౌన్‌ను రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు బిఎంయూ, సీయూలు వివి ప్యాట్‌లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల ఏర్పాటును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్డిసి ఈవిఎం గోడౌన్ ఇన్‌ఛార్జ్ కోదండ రామిరెడ్డి కలెక్టర్‌కు వివరిస్తూ అడ్వాన్స్ టెస్టింగ్ ప్రొసీజర్ పూర్తి అయిందని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఇన్స్పెక్షన్ రిజిష్టర్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో ఎన్నికల సెల్ అధికారులు పవన్, వివిధ పార్టీల ప్రతినిధులు టిడిపి మనోహరాచారి, వైసీపీ నేత చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ ప్రతినిధి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.NO. 24 OF 2023, O.S.NO. 115 OF 2020

Doddaga Masthanaiah .... DHR

Vs

1. Sripathi Narasamma.,
2. Dampella Vidhyavathi,
3. Sripathi bhanu Teja .... JDRs

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై నెంబరు లోని DHR తన డిక్రీ రాబట్టుకొనుటకు గాను JDRs తాలూకు ఈ క్రింద కనపర్చిన స్థిరాస్తిని పై కోర్టులో తేది: 22-04-2024న ఉదయం 10.30 గం॥లకు వేలం వేయబడును.

SCHEDULE

Tirupati District (SPSR Nellore District), Gudur Sub-Registration, Chillakuru Mandal, Theepanuru Village, Wet land, S.No. 112-9, Ac.0-43 cents situated within the following boundareis:-
East :- lands of Doddaga Govardhan and Dhanaiah;
South :- land of Kanna Venaiah;
West :- land of Neerukattu Venkata Subbaiah;
North :- land of Neerukattu Venkata Subbaiah;

DHA విలువ రూ. 1,50,000-00

అమ్మిన విలువ రూ. 2,40,000-00

ఇట్లు,
టి. రఘురామిరెడ్డి,
DHR తరపున న్యాయవాది, గూడూరు

NOTICE

Before the Hon'ble District Consumer Disputes Redressal Commission at Karimnagar

C.C. No. 98 of 2022

Between:
Nagireddy Ganga Reddy and Another ...*Complainant*

AND

Sri Yashoda Hospital Emergency and Critical Care, Gandhi Chowk, Raikal Mandal of Jagtial. R/by its Responsible persons & Others. ...*Opposite Parties.*

To:
O.P. No-4: Dr. Manogna, MBBS, Regd. 98388, D/o. Jayaprakash, age 30, Occ: Doctor, R/o. D.No. 19/70A, Old pet Bazar Street, Chandragiri Village and Mandal, Thirupathi Dist., Andhrapradesh.

Whereas the above named Complainant had filed the above C.C for grant of compensation against you the Opposite Party No.4 above stated.

Please take notice that the above said consumer case was posted **on 01-03-2024 at 10.30 A.M** before the above said Consumer Disputes Redressal Commission at Karimnagar for your appearance and counter, in case of making default the case will be called and determined in your absence.

//By Order of the Court//

G.SRINIVASA GOUD
H.No. 7-1-595/1, Mankammathota
Karimnagar, Cell: 9849836469